ప్రత్యేక రెస్ట్ రూమ్ ఉండాలి



హాస్పిటల్‌కు పేషెంట్స్‌తో వచ్చే అటెండర్స్‌ను తగ్గించాలి. డాక్టర్ల విజిటింగ్ టైమ్‌ను కూడా పరిమితం చేయాలి. హాస్పిటల్లో అన్ని చోట్లా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలి. అన్ని హాస్పిటళ్లలో డాక్టర్లకు ప్రత్యేక రెస్ట్ రూమ్‌లు ఉండాలి. నైట్ డ్యూటీ చేసిన డాక్టర్‌కు తర్వాతి రోజు డే అఫ్ ఇవ్వాలి. ప్రస్తుతం డ్యూటీ చేసిన మరుసటి రోజు కూడా డాక్టర్లు యథావిధిగా విధులు నిర్వహించాల్సి వస్తోంది.

–డాక్టర్ అనంత్, మాజీ హెచ్‌వోడీ, ఎనస్తీషియా విభాగం, స్టీల్ ప్లాంట్ జనరల్ హాస్పిటల్

సెక్యూరిటీ తప్పనిసరి..



ప్రభుత్వ, ప్రవేటు ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు రాత్రి సమయాల్లో తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వారికి రక్షణగా ఆస్పత్రుల్లో సరిపడా గార్డులను ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలను అవసరమైన చోట అమర్చాలి. పెందుర్తి సీహెచ్‌సీలో ఇటీవలే పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు అమర్చాం. సెక్యూరిటీ సిబ్బంది కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు ప్రశాంతంగా విధులు నిర్వహించే పరిస్థితులుంటేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

–డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెందుర్తి

ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. వీరు ఏసమయంలోనైనా అందుబాటులో ఉండేవిధంగా ఉండాలి. ఈ క్విక్ యాక్షన్ కమిటీలో వైద్యులు సిబ్బంది, స్థానిక సామాజిక కార్యకర్తలు, పోలీసులు, విద్యావేత్తలు ఉండాలి. సమస్య ఏదైనా సమాచారం అందుకున్న వెంటనే ఆస్పత్రికి వచ్చి రెస్క్యూ చేయగలగాలి. ఆస్పత్రిలో సౌకర్యాల మెరుగుకు వీరి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి. ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల వైద్యులు, సిబ్బందికి భద్రత ఉంటుంది.

– డా.సుజాత, సూపరింటెండెంట్, గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్

క్లుప్తంగా

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఎమ్మెస్సీ కంప్యూటర్స్ /ఎంసీఏ/ బీటెక్‌లో 55 శాతంతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు వారి విద్యార్హత, బోధనానుభవం, ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఓ సెట్ జెరాక్స్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. డెమో తరగతులకు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాల్సిందిగా కోరారు.

వెంకన్న ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమార్చన



లక్ష్మీదేవికి కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి, భక్తుల గోత్రనామాలతో కుంకుమార్చన జరిపారు. విశేషంగా హారతులు అందించారు. సాయంత్రం అమ్మవారి దర్శనానికి అడవివరం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి, వేంకటేశ్వరస్వామికి పూజలు జరిపారు. అర్చకులు భార్గవ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రపంచ స్థాయికి భారతీయ అంతరిక్ష ప్రతిభ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: భారతీయ అంతరిక్ష పరిశోధ ప్రాథమిక స్థాయి నుంచి నేడు ప్రపంచ స్థాయికి ఎదిగిందని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధాని మోదీ పిలుపు మేరకు తొలిసారిగా అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు అంతరిక్ష పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు కె.ప్రభుదాసు మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన భారతీయ సాంకేతిక ప్రగతిని వివరించారు. విద్యార్థులు భౌతికశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ నివేదిత, డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎం.గోవిందరావు, డాక్టర్ రత్నప్రకాష్, బి.లక్ష్మి, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం జరిపారు. చాతుర్మాస దీక్షల్లో భాగంగా శ్రీనివాస హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. శ్రీవారి కళ్యాణం వైభవంగా జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శుభములీయవే.. శ్రావణలక్ష్మీ

- వైభవంగా మూడో శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల దేవాలయాలు



పూజలందుకున్న అలివేలు మంగమ్మ



మంగమ్మ ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఎస్ఆర్ పురంలో పసుపు కొమ్ముల అలంకరణతో పూజలందుకున్న కనకదుర్గమ్మ



సుజాతనగర్ కనకదుర్గ ఆలయంలో సరస్వతీదేవిగా పూజలందుకున్న అమ్మవారు



సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ సన్నిధిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: పవిత్ర శ్రావణమాసం మూడవ శుక్రవారం పూజలతో పెందుర్తిలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. శ్రావణలక్ష్మి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాయాలాలు కిటకిటలాడాయి.

◆ చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 100 కిలోల పసుపు-కుంకుమ, పాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజల్లో దాదాపు రెండు వేల మంది మహిళలు పాల్గొన్నారు. విష్ణు, లలిత సహస్రనామ పారాయణ చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

◆ ఎస్ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ పసుపు కొమ్ములతో విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

◆ సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సరస్వతీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

◆ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీమాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

◆ సాధూమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

◆ స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.

◆ మహా కామేశ్వరీ ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

'సినర్జిన్ ప్రమాదంపై విచారణ జరిపి, చర్యలు తీసుకోండి'



జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ప్రమాద వివరాలు తెలుపుతున్న సత్యనారాయణ

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ పరిశ్రమలో గురువారం అర్ధరాత్రి జరిగిన రియాక్టర్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై యాజమాన్యాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరే ప్రమాదాలకు కారణమని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా కోశాధికారి బీవీ శ్రీనివాసరావు, సంతోష్, రమేష్, లక్ష్మణ్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పంచకర్ల ఎన్టీపీసీ సందర్శన

పరవాడ: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ఉదయం 11 గంటలకు పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీని సందర్శించనున్నట్లు పరవాడ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. హిందూజా పవర్ ప్లాంటును ఎమ్మెల్యే సందర్శించి, యాజమాన్యంతో ఉపాధిపై చర్చిస్తారని వెల్లడించారు.

భవిష్యత్ ఉపాధి పనులపై ప్రణాళిక సిద్ధం



సభలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: రానున్న ఐదేళ్లలో గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేసినట్లు పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రోజుకు రూ.100-250 వరకు వేతన ఉపాధి కల్పిస్తామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ లబ్ధిదారులకు 150 రోజుల వేతన ఉపాధి అందిస్తామన్నారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగుల నిర్మాణం, సీసీ రోడ్లను నిర్మించాలని పలువురు సభ్యులు గ్రామ సభలో కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు మండల పరిషత్ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. వర్షాకాలంలో విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సభలో ఉప సర్పంచ్ బండారు రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పైల హరీష్, కూండ్రపు సోమునాయుడు, గండి ఈశ్వరరావు, వీఆర్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గ్రామ సభలు



రాంపురం గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ శిరీష, ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎస్ఆర్ పురం గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ నాగమణి, అధికారులు

పెందుర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ఖర్చులు/పనుల కేటాయింపు అంశంపై పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు మొక్కుబడిగా సాగాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ గ్రామసభల్లో ఎక్కడా సమస్యలపై ప్రజావాణి వినిపించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు తూతూ మంత్రంగా నిర్వహించి, మమ అనిపించేశారు. ప్రభుత్వం నిర్వహించిన ఈ సభల్లో టీడీపీ, జనసేన చోటామోటా నాయకులు పాల్గొని హడావుడి చేశారు.

◆ పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం గ్రామసభలో రికార్డు స్థాయిలో 131 పనులకు ప్రతిపాదనలు వచ్చాయి. అందులో పంచాయతీలోని రోడ్లు, కాలువలు, ప్రహరీ తదితర 54 పనులకు, చెరువులను బాగుచేయడం, సరిహద్దు కందకాలు, రింగ్ కందకాలు, మొక్కల పెంపకంతో కలిపి ఇతర అంశాలపై 74 పనులకు ఆమోదం తెలిపారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, ఏపీడీ ఆంజనేయులు, ఇన్‌చార్జి కొల్లి వెంకటరావు, ఈవోఆర్డీ దీపిక, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ రాంపురంలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, అధికారులు పాల్గొన్నారు.

◆ పినగాడిలో జరిగిన గ్రామసభలో పలు పనులకు ఆమోదం తెలిపారు. సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. సరిపల్లి, వాలిమెరక, చింతలగ్రహారం, గొరపల్లి, గవరపాలెం, పెదగాడి, గుర్రంపాలెం, ముదపాక పంచాయితీలో గ్రామసభలు నిర్వహించారు.

వినాయక ఆలయ నిర్మాణం పూర్తికి కృషి



ఆలయ పరిశీలనలో ఎంపీపీ, గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక బీసీ కాలనీలోని అసంపూర్తిగా నిలిచిన వినాయక ఆలయాన్ని పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో అసంపూర్తిగా నిలిచిన వినాయకుని ఆలయాన్ని పురోహితులు, గ్రామ పెద్దలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలపై చర్చించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి, కార్తీకమాసంలోగా విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఆలయ పరిశీలనలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పైల పోతినాయుడు, పైల టీవీ అప్పారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, పోతల అప్పలనాయుడు, పైల హరీష్ పాల్గొన్నారు.

మేహాద్రిలో మురుగునీరు.. వాస్తవమే..!

- మురుగునీటి నియంత్రణకు జీవీఎంసీకి లేఖ రాశాం
- నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించాం
- జల వనరుల శాఖ జిల్లా ఏఈఈ నళిని

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: నగర ప్రజలకు తాగునీరు అందిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో కలుషిత/విషపూరిత వ్యర్థాలు కలుస్తున్నాయని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సూచనప్రాయంగా అంగీకరించారు. పెందుర్తి మండలం చింతలగ్రహారం సమీపంలో ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లోకి కొత్తవలస, పెందుర్తి ప్రాంతాల నుంచి ప్రధాన కాలువ ద్వారా గృహాల వాడుక నీరు కలుస్తున్నట్లు నిర్ధారించారు. రిజర్వాయర్‌లోకి కలుషిత నీరు చేరకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జీవీఎంసీ అధికారులకు లేఖ రాసినట్లు జలవనరుల శాఖ జిల్లా సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్(ఏఈఈ) పి.నళిని ఓ ప్రకటన విడుదల చేశారు.

పశువులు, కోళ్ల కళేబరాలతో పాటు గృహావసరాల వాడుక నీరు గ్యాలన్ల కొద్దీ మేహాద్రిలో చేరుతోంది. దీనినే జీవీఎంసీ ఆధునిక పద్ధతుల ద్వారా శుభ్రపరచి నగర ప్రజలకు తాగునీటి రూపంలో అందిస్తున్నారు. దీనిపై సాక్షి దినపత్రిక 'ఆ జలం.. గరళం' శీర్షికతో ఈ నెల 19న ఓ కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా జలవనరుల శాఖ అధికారులు పరిస్థితిని జీవీఎంసీ అధికారులకు వివరిస్తూ వ్యర్థాలు/కలుషిత నీరు మేహాద్రిలో చేరకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని లేఖ రాశారు. దీనిపై జీవీఎంసీ అధికారులు ఏ కార్యాచరణ ప్రకటిస్తారో తెలియాల్సి ఉందని చెప్పారు.

కాలువల్లో వ్యర్థాల చేరికపై నియంత్రణ ఏదీ?

మేహాద్రి రిజర్వాయర్ వాస్తవానికి జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ ఇందులో నీటిని నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నందున జీవీఎంసీకే ఎక్కువ బాధ్యత ఉంది. అయితే కలుషిత/వ్యర్థాల నియంత్రణకు పెద్దన్న పాత్ర పోషించాల్సిన జీవీఎంసీ యంత్రాంగం కనీసం పట్టించుకోవట్లేదు. మైదాన ప్రాంతాల్లోని వర్షపు నీటిని దాదాపు పది చిన్నాపెద్దా కాలువలు మేహాద్రికి చేరుస్తాయి. ఇటు పెందుర్తి రైల్వే వంతెన సమీపం నుంచి చింతలగ్రహారం ప్రధాన కాలువ ద్వారా, అటు సబ్బవరం బొర్రమ్మగెడ్డ ద్వారా అధికశాతం నీరు మేహాద్రికి వస్తుంది. ఆయా కాలువలే ప్రస్తుతం నీటి కలుషితానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం, కొత్తవలస ప్రాంతాల నుంచి పశువులు, కోళ్ల వ్యర్థాలతో పాటు, ప్రజలు వాడుతున్న మురుగు నీరు ఈ కాలువల్లోకే విడిచిపెడుతున్నారు. దీంతోపాటు చింతలగ్రహారం సమీపంలోని రిజర్వాయర్ ప్రధాన కాలువలో నిత్యం టన్నుల కొద్దీ చెత్త వేస్తున్నారు. ఆయా చెత్తాచెదారం, విషపూరిత వ్యర్థాలు మురుగు నీటితో కలిసి రిజర్వాయర్లోకి చేరుతున్నాయి. దీంతో పాటు రిజర్వాయర్ మొత్తం పూడికతో పేరుకుపోయింది. ఇలా అన్ని రకాలుగా రిజర్వాయర్‌ను జీవీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెతున్నాయి. రిజర్వాయర్‌లో నీరు ఇంతటి ప్రమాదకరంగా మారినా జీవీఎంసీ యంత్రాంగం పట్టించుకోకపోవడం ఏంటన్న ఆక్షేపణలు వినిపిస్తున్నాయి.

రైవాడ కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

సబ్బవరం: మండలంలోని జోడుగుళ్ల సమీపంలో రైవాడ కాలువ జీవీఎంసీ పంప్ హౌస్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం లభ్యమయింది. కాలువను అనుకుని ఉన్న సిమెంట్ బెంచ్‌పై మృతదేహాన్ని చూసిన స్థానికులు ఆ విషయాన్ని వీఆర్వోలు పూడి శేషు, అనంత్‌లకు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది సబ్బవరం పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద మృతుడు వేసుకున్న చెప్పులు, చేతికర్ర బెంచికి ఆనించి ఉన్నాయి. వీఆర్వోల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: సుజాతనగర్‌లో నివాసం ఉంటున్న కోరుకొండ కొండలరావు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు అతని భార్య కొండలక్ష్మి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ ఎం.ప్రకాష్ తెలిపిన వివరాలు. సుజాతనగర్‌లోని ఎస్‌వీఎల్ఎన్ అపార్ట్‌మెంట్‌లో కొండలరావు కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 4న మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కొండలరావు భార్యతో గొడవ పడి నిద్ర పోయాడు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచేసరికి అతడు ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేక పోయేసరికి గురువారం రాత్రి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో హెచ్‌సీ ప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పనుల పూర్తి

- సబ్బవరం గ్రామ సభలో ఎమ్మెల్యే పంచకర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం:గ్రామ సభల్లో అధిక సంఖ్యలో ప్రజలను భాగస్వామ్యం చేసి, గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, గ్రామాలను అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సబ్బవరం మేజర్ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సభలను నిర్వహించి, ప్రాధాన్యతా క్రమంలో పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి పనినీ ఏడాది వ్యవధిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల వరకే పార్టీలని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో అధికారుల బదిలీలు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఈవోపీఆర్డీ మహేష్, గ్రామ సభ స్పెషల్ అధికారి బీఎస్ఎన్ మూర్తి, ఎంపీటీసీ సభ్యులు బైలపూడి దేముడుబాబు, గొర్లి కృష్ణ చైతన్య, ఆర్ఈసీఎస్ మాజీ అధ్యక్షుడు కోటాన అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొని..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం హైవేపై దేవీపురం సమీపంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కుక్కను ఢీకొనడంతో, అదుపు తప్పి డివైడర్‌పై పడి శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. విశాఖ జిల్లాలోని వేపగుంట సమీపంలో కృష్ణరాయపురానికి చెందిన గుడిల్ల జయ సంపత్ కార్తీక్(39) సీసీ కెమెరాల రిపేర్లు చేస్తుంటారు. అందులో భాగంగానే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం వస్తుండగా ప్రమాదం జరిగి, తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2 గంటల సమయంలో మరణించడంతో, సబ్బవరం పోలీస్‌లకు మృతుని బంధువులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.

డిజిటల్ యుగంలో జాగరూకత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే

విశాఖ సిటీ: డిజిటల్ యుగంలో ఉద్యోగులు జాగరూకత, అవగాహన, భద్రతను పాటించడం అవసరమని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోర్ట్ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్‌తో పాటు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎల్.ఎల్.స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సైబర్ మోసాలు, నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలను సైబర్ సెక్యూరిటీ నిపుణులు వివరించారు. రోజువారీ జీవితాలలో సైబర్ మోసాలు, నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఈ సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.